ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

3

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 28 మార్చి 2025



టీడీపీ శ్రేణులపై విరుచుకుపడుతున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి

ఉత్కంఠ.. ఉద్రిక్తత..!

రెండు చోట్ల నేటికి వాయిదా.. 3 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీల ఎన్నిక

కంబదూరులో ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు అస్వస్థత

గాండ్లపెంటలో గందరగోళం.. రామగిరిలో ఉద్రిక్తత



టీడీపీలో చేరిన గాండ్లపెంట వైస్ ఎంపీపీ భారతి



ఎన్నికలను పర్యవేక్షిస్తున్న సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య



గాండ్లపెంట : డీఎస్పీ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద మోహరించిన పోలీసులు

పెనుకొండ టౌన్/కదిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఐదు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాలకు గానూ రెండు చోట్ల శుక్రవారానికి వాయిదా పడ్డాయి. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపీపీ పదవి ఎన్నికలు కోరం లేక వాయిదా పడ్డాయి. అనంతపురం జిల్లా గాండ్లపెంట ఎంపీపీ పదవి ఎన్నికల్లో ఒకే ఎంపీటీసీ ఇద్దరు ఎంపీపీ అభ్యర్థులను ప్రపోజ్ చేయడంతో గందరగోళం ఏడింది. దీంతో ఎన్నికను వాయిదా వేశారు. ఈ రెండు స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తారు. కంబదూరు ఎంపీపీ ఎన్నిక సమయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ మద్దిలేటి ఆందోళనకు లోనయ్యారు. బీపీ పెరిగి ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. అప్పటికే అక్కడికి చేరుకున్న జేసీ శివనారాయణ శర్మ.. ఎన్నిక ప్రక్రియను కొనసాగించాలని ఎంపీడీఓ, తహసీల్దారును ఆదేశించారు. దీంతో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా మూడు ఎంపీపీ, నాలుగు వైస్ ఎంపీపీ స్థానాల ఎన్నికలు పూర్తి అయ్యాయి.

ఎన్నికైంది వీరే..

కణేకల్లు ఎంపీపీగా వండ్రయ్య, కంబదూరు ఎంపీపీగా లక్ష్మీదేవి, రొద్దం ఎంపీపీగా నాగమ్మను సభ్యులు ఎన్నుకున్నారు. ఉరవకొండ వైస్ ఎంపీపీగా ఉరవకొండ-10 ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్ గౌడ్, పెద్దపప్పూరు వైస్ ఎంపీపీగా నాగవేణి, రాయదుర్గం వైస్ ఎంపీపీగా వజ్రహొన్నూరు ఎంపీటీసీ అరుణ్‌కుమార్, యల్లనూరు వైస్ ఎంపీపీగా తిమ్మంపల్లి ఎంపీటీసీ రమాదేవి ఎన్నికయ్యారు. వీరందరూ వైసీపీ వర్గీయులే. జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, తొమ్మిది మండలాల ఎన్నికల అధికారులను

(తరువాయి 5లో)

టీడీపీలో చేరిన వైస్ ఎంపీపీ

కదిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన గాండ్లపెంట వైస్ ఎంపీపీ పి.భారతి గురువారం రాత్రి టీడీపీలో చేరారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సమక్షంలో తన భర్త ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నాయకుడు రామలింగారెడ్డితో కలిసి ఆమె టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటరమణా రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ఆ రోజుల్లోనూ రిజిస్ట్రేషన్..!



అనంతపురం క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాల్లోనూ రిజిస్ట్రేషన్‌లు చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ప్రకటించింది. ఈ నెల 30, 31 తేదీలను పనిదినాలుగా ప్రకటిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 30న ఉగాది, 31న రంజాన్ పండుగ ఉన్నాయి. ఆ రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి.

ఒకటి నుంచి మార్పులు

రిజిస్ట్రేషన్‌ల శాఖలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మార్పులను ప్రవేశపెట్టింది. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాల్లో నిరీక్షించే అవసరం లేకుండా, ముందస్తుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనుంది. ఒకటో తేదీ నుంచి స్లాట్ బుక్ చేసుకుని, నిర్ణీత సమయానికి వెళితే రిజిస్ట్రేషన్ చేస్తారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

పది పరీక్షలు బాగా రాయలేకపోతున్నానని..



బాబు(ఫైల్)

లేపాక్షి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులమతి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాబు అనే విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. పరీక్షలు బాగా రాయలేకపోతున్నానని ఆందోళన చెంది, గురువారం గ్రామ పొలిమేరలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. గమనించిన కూలీలు, 108కు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని అంబులెన్స్ సిబ్బంది హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సడ్లపల్లికి చెందిన అంజినప్ప, అంజినమ్మ దంపతుల కుమారుడు బాబు. ఫెయిల్ అవుతానన్న భయంతోనే ఆత్మహత్యకు యత్నించాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూగజీవాల దాహం తీర్చాలని..

ఎండలు మండి పోతుండడంతో మూగజీవాలు దాహంతో విలవిల్లాడుతున్నాయి. వాటి దాహం తీర్చేందుకని మండలంలోని కొట్టాల సమీపాన బీఎస్ఆర్ ఫాంహౌస్ నిర్వాహకుడు బొడ్డు నాగరాజు రూ.30వేలతో నీటి తొట్టెను ఏర్పాటు చేశారు. మూగజీవాల దాహార్తి తీర్చడానికి ఫాంహౌస్ ముందు నీటి తొట్టె ఏర్పాటు చేసినట్లు బొడ్డు నాగరాజు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఓబుళదేవరచెరువు



తొట్టెలోని నీరు తాగుతున్న గొర్రెలు

యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అందజేసే ప్రధానమంత్రి యోగా అవార్డు-2025కి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి ఉదయ్‌భాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. యోగా ప్రచారం, అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు, దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం 20 ఏళ్లగా యోగా సేవలో ఉంటూ, వయసు 40ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వ్యక్తులు, సంస్థలు ఈనెల 31వ తేదీలోపు http:///innovateindia.mygov.in/pmyogaawards2025 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.36 (శుక్రవారం సాయంత్రం)

సెహరీ : 4.58 (శనివారం ఉదయం)

పీఎంజేఏవైకి వృద్ధులు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై)కు 70 ఏళ్లు నిండిన వయోవృద్ధులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు వినోద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోగానీ, సమీప సచివాలయంలోగానీ ఆరోగ్య కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా వర్తింపజేస్తారన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 145555లో సంప్రదించాలని సూచించారు.



శ్రీసత్యసాయి జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయం

దొంగ చేతికి తాళాలు..!

అవినీతి అధికారిని చర్యల నుంచి తప్పించే ప్రయత్నం

- మెమో జారీతో సరి..
- విచారణలో పాల్గొన్న వార్డెన్ల వివరాలు బహిర్గతం
- ఆధారాలు సేకరించి పంపాలని అవినీతి అధికారికి బాధ్యతలు
- రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం
- రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నిర్వాకమిదీ..
- మంత్రిని తప్పుదోవ పట్టించిన వైనం



అనంతపురం, మార్చి27(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణల నేపథ్యంలో విచారణ ఎదుర్కొన్న అధికారికే ఆధారాలు సేకరించాలని ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆదేశాలివ్వడం.. దొంగ చేతికి తాళాలిచ్చిన చందంగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. శ్రీసత్యసాయి జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ అధికారిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో... 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. వాటి ఆధారంగా ఆ అవినీతి అధికారిపై ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణాధికారిగా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి నెలన్నర క్రితం శ్రీసత్యసాయి జిల్లాకు రావడం... ఆ అవినీతి అధికారిపై క్షేత్రస్థాయిలో వార్డెన్లతో విచారణ చేపట్టడం వరుసగా జరిగిపోయాయి. ఆ వార్డెన్ల ద్వారా సేకరించిన ఆధారాలతో నివేదిక తయారు చేసి, ఆ శాఖ డైరెక్టర్‌కు అందజేస్తామని విచారణాధికారి స్పష్టంగా వెల్లడించారు. నెలన్నర క్రితం విచారణ పూర్తయితే... నివేదిక అందజేయడానికి అంతే సమయం పట్టడం అనేక అనుమానాలకు...

(మిగతా 5వ పేజీలో..)

బదిలీ భయం..!

సబ్ డివిజన్‌లో నాలుగేళ్లు దాటిన పోలీసుల జాబితా సిద్ధం

- పాతుకుపోయిన వారిలో గుబులు
- చిత్తూరు ఎఫెక్ట్ ఇక్కడ కూడా..
- తప్పించుకునేందుకు పైరవీలు





హిందూపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పోలీసు వ్యవస్థ ఆ పార్టీ నాయకులకు కాపలాదారులుగా మారిందన్నది నగ్న సత్యం. అప్పట్లో శాంతిభద్రతలు పక్కనబెట్టి, ప్రజాసమస్యలు పట్టించుకోకుండా, స్టేషన్‌కు వచ్చిన బాధితుల గోడు వినకుండా కేవలం వైసీపీ నాయకులు చెప్పిందే చేసుకుంటూ వెళ్లారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటుతున్నా పోలీసు స్టేషన్‌లో పూర్తిస్థాయిలో బదిలీలు కాకపోవడంతో ఇంకా కొంతమంది సిబ్బందిలో వైసీపీ వాసన పోలేదు. ఈ నేపథ్యంలో స్టేషన్‌కు వెళ్లిన బాధితులకు కొన్నిచోట్ల అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికీ వైసీపీ నాయకులు చెప్పిందే పోలీసు స్టేషన్‌లో నడుస్తోందని జిల్లాలోని నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధే బహిరంగంగా చెప్పడం విశేషం. ఈ తరుణంలో ఇటీవల పక్క జిల్లా చిత్తూరులో టీడీపీ కార్యకర్తను దారుణంగా హత్యచేశారు. ఆయనకు ప్రాణహాని ఉందని టీడీపీ ముఖ్యనేతలు కోరినా.. పోలీసు శాఖ పట్టించుకోలేదు. భయపడినట్లుగానే ఆయనను ప్రత్యర్థులు హత్య చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఆ ప్రభావంతో చిత్తూరు జిల్లాలో ఒకేసారి కానిస్టేబుల్ మొదలుకుని ఏఎస్‌ఐ వరకు 264 మందిని బదిలీ చేయడం సంచలనం రేపింది. జిల్లాలో కూడా అలాంటివారు ఉన్నారేమోనని డీఐజీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసుల్లో బదిలీ భయం పట్టుకుంది. ఎక్కడ తమను బదిలీ చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

జాబితా సిద్ధం

డీఐజీ ఆదేశాల మేరకు జిల్లాలో కానిస్టేబుల్ మొదలుకుని ఏఎస్‌ఐ వరకు నాలుగేళ్లు ఒకే సబ్ డివిజన్‌లో పనిచేసిన వారి జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇందులో కొంతమంది వేరే సబ్ డివిజన్‌కు బదిలీ అయినా అటాచ్‌మెంట్ పేరుతో ఒకే స్టేషన్‌లో ఒకే సబ్ డివిజన్‌లో 10 నుంచి 16 ఏళ్లదాకా చేసినవారు ఉన్నారు. అలాంటి వారిని గుర్తించే పనిలో పోలీసు శాఖ నిమగ్నమైంది. అలాంటివారు చాలామంది ఉన్నారు. వారిని ప్రస్తుతం పనిచేస్తున్న సబ్‌డివిజన్‌కు కనీసం 50కి.మీ. దూరంలో పోస్టింగ్ ఇవ్వాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. అలా చేస్తేనే కొంతమందిలో పరివర్తన వస్తుందని భావించినట్లు తెలిసింది. హిందూపురం, పెనుకొండ సబ్ డివిజన్లలో నాలుగేళ్లు దాటినవారి సంఖ్య 40 దాకా ఉన్నట్లు సమాచారం. వీరందరినీ కదిరి, ధర్మవరం, సబ్ డివిజన్లకు బదిలీ చేసి, అక్కడున్న వారిని ఇక్కడికి తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలిసింది. అప్పుడే శాంతిభద్రతలు అదుపులోకి వస్తాయన్న నమ్మకం కూడా పోలీసు అధికారుల్లో ఉంది. ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

పాతుకుపోయిన వారిలో గుబులు

ఒకే సబ్‌డివిజన్‌లో ఐదు నుంచి పదేళ్లదాకా పాతుకుపోయిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఎక్కడ తమను దూరంగా పంపుతారోనన్న బెంగ పట్టుకుంది. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్లలో ఇలాంటివారు సగంమంది ఉన్నట్లు ఉన్నతాధికారులు అంచనాకు వచ్చారు. వీరందరినీ ఇతర సబ్‌డివిజన్లకు పంపితేనే సరిపోతుందన్న ఆలోచన అధికారుల్లో ఉంది. అంతేకాదు, వైసీపీకి అనుకూలంగా పనిచేసినవారి జాబితా కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. దీంతో అలాంటి వారిలో గుబులు పుట్టుకుంది.

పైరవీలు మొదలు

చిత్తూరు తరహాలోనే జిల్లాలో కూడా ఒకేచోట నాలుగేళ్లకు పైబడి పని చేసిన వారిని బదిలీ చేసేందుకు జాబితా సిద్ధం అవుతుందన్న ప్రచారం సాగుతోంది. దీంతో కొంతమంది పోలీసులు తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు నాయకుల చెంతకు చేరుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు మాత్రం బదిలీల్లో నాయకుల ప్రమేయం ఉండదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పాతుకుపోయినవారు అక్కడే ఉంటే తలెత్తే పరిణామాలను నాయకులకు వివరిస్తూ బదిలీల్లో జోక్యం చేసుకోవద్దని సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. అయినా కొంతమంది పోలీసులు.. నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు మొదలెట్టారు. మరికొంతమంది పిల్లల చదువులు, తల్లిదండ్రుల అనారోగ్యం అంటూ సాకులు చెప్పి తప్పించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా ఏ ఒక్కరికీ మినహాయింపు ఉండదని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు సూచనప్రాయంగా ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఏది ఏమైనా పాతుకుపోయిన వారిని సబ్‌డివిజన్ దాటిస్తేనే పోలీసింగ్ పటిష్ఠం అవుతుంది.

ఉత్కంఠ.. ఉద్రిక్తత..!

(3వ పేజీ తరువాయి)
సమన్వయం చేసుకున్నారు. రెండు స్థానాల్లో ఎన్నిక వాయిదా పడిన విషయాన్ని కలెక్టర్లు, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఇద్దరికీ మద్దతు..!


పోలింగ్ కేంద్రం వద్ద మోహరించిన పోలీసులు

గాండ్లపెంట: ఎంపీడీఓ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు. ఏడుగురు ఎంపీటీసీలలో ఉదయం 10 గంటలకు ఇద్దరు టీడీపీ ఎంపీటీసీలు జయరామిరెడ్డి, సోముశేఖర్‌రెడ్డి వచ్చారు. సోముశేఖర్ రెడ్డి నామినేషన్ వేశారు. కానీ కోరం లేక కాసేపు ఎన్నికల ప్రక్రియను ఆపేశారు. ఆ తరువాత వైసీపీ ఎంపీటీసీలు ముగ్గురు 11.30కు, మరొకరు 11.45కు వచ్చారు. కానీ వారెవరూ నామినేషన్ వేయలేదు. ఎన్నికల అధికారులు కల్పించుకుని, నామినేషన్ వేస్తున్నారా లేదా అని అడిగారు. దీంతో గంగోజమ్మతో నామినేషన్ వేయించారు. ముగ్గురు సభ్యులు ఆమెను బలపరిచారు. కానీ ఈ ముగ్గురిలో ఒకరు సోముశేఖర్ రెడ్డిని కూడా బలపరిచారు. దీంతో గందరగోళం ఏర్పడి, ఎన్నిక వాయిదా పడింది. పోలింగ్ కేంద్రానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వచ్చారు. ఇరువర్గాల నడుమ చిన్నపాటి వాగ్వాదాలు జరిగాయి. పోలీసులు సర్దిచెప్పి పంపించారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దారు బాబురావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి హాజరయ్యారు.

వండ్రయ్య ఏకగ్రీవం



కణేకల్లు: గరుడచేడుకు చెందిన ఎంపీటీసీ వండ్రయ్య ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు 14 మంది ఎంపీటీసీలు మద్దతు తెలిపారు. మారెంపల్లి ఎంపీటీసీ లీలావతి ఆయనను బలపరిచారు. ప్రిసైడింగ్ అధికారి భార్గవ్ వండ్రయ్యను ఎంపీపీగా ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీ సంధ్య ఏడాది క్రితం రాజీనామా చేయడంతో తాజాగా ఎన్నిక జరిగింది.

రొద్దం ఎంపీపీగా నాగమ్మ

పెనుకొండ రూరల్: రొద్దం ఎంపీపీగా చిన్నమంతూరుకు చెందిన నాగమ్మ ఏకగ్రీవం అయ్యారు. ఎంపీపీ చంద్రశేఖర్ ఏడాదిక్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో తాజాగా ఎన్నిక నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి విజయ్‌ప్రసాద్, ఎంపీడీఓ రాంకుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎంపీటీసీ వనజ నాగమ్మ పేరును ప్రతిపాదించారు. పెద్దగువ్వలపల్లి ఎంపీటీసీ అనితలక్ష్మీ బలపరిచారు. మిగిలిన 15 మంది మద్దతు తెలిపారు.

మీకు మీరే.. మాకు మీమే..

రొద్దం ఎంపీపీ ఎన్నికల్లో శంకర్‌నారాయణ, ఉష శ్రీచరణ్ వర్గీయులు వేర్వేరుగా కూర్చున్నారు. ఎంపీపీగా ఎన్నికైన నాగమ్మ, మరో ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే ఉష శ్రీచరణ్ వద్దకు వెళ్లారు. మిగిలిన ఎంపీటీసీలు శంకర్‌నారాయణ వర్గం నాయకులతో కలిసి వెళ్లిపోయారు.


నాగమ్మకు మద్దతు ప్రకటిస్తున్న ఎంపీటీసీలు

కంబదూరులో హైడ్రామా

గొడవకు దిగిన మాజీ ఎంపీపీ... ప్రిసైడింగ్ అధికారికి అస్వస్థత... ఎంపీపీగా ఎన్నికైన లక్ష్మీదేవి

కళ్యాణదుర్గం: కంబదూరు ఎంపీపీ ఉప ఎన్నిక ఉద్రిక్తత నడుమ జరిగింది. వైసీపీ నాయకులు హంగామా చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ మద్దిలేటి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ ఉదయం మొదలైంది. వైసీపీ ఎంపీటీసీలు 13 మంది ఉదయం 11 గంటల సమయంలో విహార యాత్ర నుంచి నేరుగా ఎంపీడీఓ కార్యాలయం వద్దకు ప్రత్యేక వాహనంలో వచ్చారు. ఈ క్రమంలో చెక్‌పోస్టు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పోలీసులతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. డీఎస్పీ రవిబాబు ప్రత్యేక బృందాలతో వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. 11.30 గంటలకు నామినేషన్ల స్వీకరణ, ఎన్నికను ప్రారంభించారు. ఎంపీటీసీలతో ఓ నోట్ పుస్తకంలో సంతకాలు చేయించుకుంటుండగా, మాజీ ఎంపీపీ, ములకనూరు ఎంపీటీసీ తలారి తిమ్మరాజమ్మ వారితో వాగ్వాదానికి దిగారు. 'ఏం పాపం చేశారని అవమానిస్తున్నారు..?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు సంతకం చేసిన నోట్ పుస్తకంలోని ఓ కాగితాన్ని ఆమె ఒక్కసారిగా చించేశారు. ఎన్నికను ఎలా నిర్వహిస్తారో చూస్తానని అధికారులతో వాదనకు దిగారు. ఈ గొడవ కారణంగా ఆందోళన చెందిన ప్రిసైడింగ్ అధికారి మద్దిలేటి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎన్నిక వాయిదా పడుతుందని భావించారు. ఈలోగా జేసీ శివనారాయణ శర్మ అక్కడికి చేరుకుని, ఈవోఆర్డీ గూడెన్న, శెట్టూరు తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టికి ఎన్నికల బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిద్దరి సమక్షంలో ఎన్నిక సాఫీగా జరిగింది. రాళ్ల అనంతపురం ఎంపీటీసీ కురుబ లక్ష్మీదేవమ్మను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈవో తిప్పయ్య, ఈవోఆర్డీ గూడెన్న ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు.


కంబదూరు ఎంపీపీగా డిక్లరేషన్ అందుకుంటున్న లక్ష్మీదేవి

టెన్షన్.. టెన్షన్..!


ఎంపీటీసీలతో వాహనంలో వెళ్తున్న వైసీపీ నాయకులు

రామగిరి/పెనుకొండ టౌన్/హిందూపురం: రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి ఇద్దరు వైసీపీ, ఒక టీడీపీ ఎంపీటీసీ మాత్రమే వచ్చారు. మిగిలిన ఆరుగురు వైసీపీ నాయకుల అధీనంలో ఉండిపోయారు. ఎన్నికల గడువు మధ్యాహ్నం 12 గంటల్లోగా వారు రాకపోవడంతో కోరం లేక శుక్రవారానికి వాయిదా వేస్తున్నామని ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. ఎన్నికలకు శుక్రవారం హాజరు కావాలని సభ్యులకు నోటీసులు జారీ చేశారు. అప్పటికే పెనుకొండ నుంచి బయలుదేరి, కుంటిమద్ది వరకూ వచ్చిన వైసీపీ ఎంపీటీసీలు, ఎన్నిక వాయిదా విషయం తెలుసుకుని వెనుదిరిగారు. మరోవైపు ఎంపీడీఓ కార్యాలయం బయట ఉద్రిక్తత ఏర్పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వైసీపీ సభ్యుల కోసం అధికారులు ఉత్కంఠగా ఎదురుచూశారు. పేరూరు-2 ఎంపీటీసీ భారతిని తమకు తెలియకుండా తీసుకెళ్లారని, ఆమె వస్తే తమకు అప్పగించాలని కోరుతూ కుటుంబ సభ్యులు రామగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేచి చూశారు. మరో ఎంపీటీసీ బంధువులు కూడా అక్కడే ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేశారు. అనుమతి ఉన్న వారినే లోనికి అనుమతించారు. శుక్రవారం కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు.

పెనుకొండలో రచ్చ

రామగిరి ఎంపీపీ ఎన్నిక రాజకీయం గురువారం పెనుకొండకు మారింది. రామగిరి మండలంలో తొమ్మిది మంది ఎంపీటీలు ఉండగా.. ఇటీవల ఎంపీపీ నాగమ్మ మృతిచెందారు. మిగిలిన ఎనిమిది మందిలో ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీటీసీల ఆచూకీ తెలపాలని వారి కుటుంబ సభ్యులు పోలీసులను డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వారు తనవద్దే ఉన్నారని, పెనుకొండ తహసీల్దారు వద్ద హాజరు పరుస్తున్నానని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం తహసీల్దారును కలిసి, ఎంపీటీసీలను శుక్రవారం తానే స్వయంగా రామగిరికి తీసుకువస్తానని, అంతవరకూ వారి యోగక్షేమాలు తానే చూసుకుంటానని లిఖితపూర్వకంగా తెలియజేశారు. అలాంటి అనుమతి ఇచ్చే అధికారం తనకు లేదని, పోలీసులను సంప్రదించాలని తహసీల్దారు శ్రీధర్ ఆయనకు సూచించారు. ఇదే సమయంలో రామగిరికి చెందిన టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పెనుకొండకు చేరుకున్నారు. వైసీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తహసీల్దారు కార్యాలయం వద్దకు వెళ్లారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


రోడ్డుపై బైఠాయించిన ఉష శ్రీచరణ్, గిరిజమ్మ

నీ అంతు చూస్తా..! రెచ్చిపోయిన మాజీ ఎమ్మెల్యే


వేలుచూపి డీఎస్పీ, సీఐని బెదిరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి

పెనుకొండ తహసీల్దారు కార్యాలయం వద్దకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి.. ఆగ్రహంతో ఊగిపోయారు. తహసీల్దార్ కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనను హిందూపురం డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, నాగేంద్రబాబు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు, ప్రకాశ్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. అదే సమయంలో టీడీపీ నాయకులు అక్కడ కనిపించడంతో బూతు పురాణం మొదలు పెట్టారు. అంతు చూస్తానని వేలెత్తిచూపుతూ బెదిరించారు. పోలీసులు ఫ్యాక్షనిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. 'మీకు అధికారం ఎన్ని రోజులుంటుందో లెక్కపెట్టుకోండి' అని బెదిరించారు.

కిడ్నాప్ చేయలేదు..



పేరూరు-2 ఎంపీటీసీ భారతిని రామగిరి పోలీసులు గురువారం సాయంత్రం తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. వైసీపీ నాయకులు తనను కిడ్నాప్ చేశారని తన చెల్లెలు గంగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారని, అది వాస్తవం కాదని తెలిపారు. తన చిన్న కూతురు ఆరోగ్యం బాగలేకుంటే చూసేందుకు వెళ్లానని అన్నారు. తన భర్త వైసీపీ నాయకుల అధీనంలో ఉన్నారని, శుక్రవారం జరిగే ఎంపీపీ ఎన్నికకు వెళ్లాలా లేదా అనేది ఇంకా నిర్ణయించుకోలేదని ఆమె తెలిపారు.

ఎన్ఎస్ గేటులో పోలీసు బందోబస్తు


ఎన్ఎస్ గేటులో పోలీసు బందోబస్తు

చెన్నేకొత్తపల్లి: రామగిరి ఎంపీపీ ఉప ఎన్నికను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎన్ఎస్ గేటులో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. రాజకీయ నాయకుల వాహనాలను అనుమతించలేదు. వైసీపీ శ్రేణులు చెన్నేకొత్తపల్లికి, టీడీపీ శ్రేణులు ఎన్ఎస్ గేటు వద్దకు చేరుకున్నారు. పోలీసులు వారిని హెచ్చరించి పంపించారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని జాతీయ రహదారి పక్కన డాబా వద్ద జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ శ్రేణులు గుంపుగా చేరడంతో పోలీసులు వారిని అక్కడికి నుంచి పంపించేశారు.


సీకేపల్లిలో ఓ దాబా వద్ద జడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ శ్రేణులు


పెనుకొండ తహసీల్దార్ ఎదుట ఎంపీటీసీలు


రామగిరిలో ఎంపీటీసీ సభ్యులను తనిఖీ చేస్తున్న పోలీసులు


రామగిరి ఎన్నిక కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

దొంగ చేతికి తాళాలు..!

(3వ పేజీ తరువాయి..)
తావిస్తోంది. నాలుగురోజుల క్రితం ఆ శాఖ రాష్ట్రస్థాయి డైరెక్టర్ నుంచి ఆ అవినీతి అధికారికి చిన్నపాటి మెమో జారీ చేశారు. జాయింట్ డైరెక్టర్ విచారణకు హాజరైన వార్డెన్ల పేర్లను ఆ మెమోలో పొందుపరచడం..., వారి ద్వారా 15 రోజుల్లోపు ఆధారాలు సేకరించి పంపాలని ఆ అవినీతి అధికారికే ఆదేశాలివ్వడం విడ్డూరం. దీని వెనుక పెద్ద తతంగమే నడిచిందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆరోపణలతో విచారణ ఎదుర్కొన్న అధికారికే ఆధారాలు సేకరించే బాధ్యతలు అప్పగించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై విచారణ చేపట్టిన విషయం, అందులో వెల్లడైన అంశాలు, నివేదిక ఆధారంగా తీసుకున్న చర్యల వివరాలను సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మంత్రిని కూడా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు తప్పుదోవ పట్టించారన్న విషయం స్పష్టమవుతోంది.

బహిర్గతం చేయడానికేనా..?

ఓ అధికారిపై అవినీతి ఆరోపణలు వచ్చినపుడు ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులను విచారణాధికారులుగా నియమించడం సర్వసాధారణం. బాధితుల ద్వారా ఆధారాలు సేకరించడం విచారణాధికారి బాధ్యత. బాధితులు వెల్లడించిన అంశాల మేరకు నివేదిక తయారు చేయడం, దాని ఆధారంగా ఆ అధికారిపై చర్యలు తీసుకోవడం ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారిపై ఉంటుంది. శ్రీసత్యసాయి జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి విషయంలో మాత్రం అందుకు భిన్నంగా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వ్యవహరించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి జారీ చేసిన మెమోనే ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా అందించిన వార్డెన్ల పేర్లు మెమోలో పొందుపరచడం అనుమానాలకు తావిస్తోంది. ఆ అవినీతి అధికారిని చర్యల నుంచి తప్పించే ప్రయత్నంలో భాగమే ఇది అనడంలో సందేహం లేదు. ఆ శాఖ వర్గాల్లోనూ అదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిని బట్టి చూస్తే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని వంత పా డుతూ.. వార్డెన్లను బలి చేసే ప్రయత్నమని స్పష్టమవుతోంది.

కాసులతో పావులు కదపడంతోనేనా..?

అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొన్నా... బాధిత వార్డెన్ల నుంచి లిఖితపూర్వక వివరాలు సేకరించినా... ఆ అధికారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీ తతంగమే నడిచినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం. నివేదికను ఉన్నతాధికారికి మూడ్రోజుల్లో ఇస్తానని విచారణాధికారి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేయడంతో తనపై ఎక్కడ చర్యలు తీసుకుంటారోనని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి అప్రమత్తమైనట్లు సమాచారం. హుటాహుటిన విజయవాడ వెళ్లినట్లు తెలుస్తోంది. మూడ్రోజులపాటు అక్కడే తిష్ట వేసి, తనపై చర్యలు తీసుకోకుండా కాసులతో పావులు కదిపినట్లు సమాచారం. ఆ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కీలక అధికారితో మంతనాలు జరపడం... రూ.లక్షల్లో చేతులు మారిన నేపథ్యంలోనే... ఆ అధికారిని చర్యల నుంచి తప్పించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ శాఖలో ప్రస్తుతం ఇది హాట్ టాపిక్‌గా మారింది.

పోక్సో కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, మార్చి27(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్య ప్రవర్తనపై నమోదైన పోక్సో కేసులో ముద్దాయి దాసరి సురేష్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.1.50లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. యాడికి మండలం కోన ఉప్పలపాడు(ప్రస్తుతం యాడికి మండల కేంద్రం లాలప్ప కాలనీ)కు చెందిన దాసరి సురేష్ 2021 సెప్టెంబరు 19న ఐదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాత్‌రూమ్‌కు పిలుచుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తుండగా... బాలిక తండ్రి గమనించడంతో సురేష్ పారిపోయాడు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి యాడికి ఎస్ఐ రాంభూపాల్ పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి ఏడుగురు సాక్షులను విచారించారు. సురేష్‌పై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు.

దోపిడీ దొంగల బీభత్సం

రెండు పెట్రోల్ బంకుల లూటీ
సిబ్బందిని రాడ్లు, కర్రలతో బెదిరించి సొమ్ము దోచుకున్న వైనం...

ఉరవకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. గురువారం తెల్లవారుజామున గంట వ్యవధిలోనే రెండు పెట్రోల్ బంకుల్లో డబ్బు లూటీ చేశారు. మండలంలోని ఆమిద్యాల, వజ్రకరూరు పెట్రోల్ బంకుల్లో రూ.3.70లక్షల నగదు దోచుకెళ్లారు. సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారు. ఈ దోపిడీ కలకలం రేపింది.

ఆమిద్యాల నుంచి వజ్రకరూరు..

ఉరవకొండ మండలంలోని ఆమిద్యాలలో గల రంగమ్మ ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు బొలెరో వాహనంలో ముఖాలకు మాస్కులు ధరించిన ఆరుగురు కర్రలు, రాడ్లుతో వచ్చారు. అక్కడ నిద్రిస్తున్న వాచ్‌మన్ రామాంజనేయులు, సిబ్బందిని లేపి రాడ్లు, కర్రలతో బెదిరించారు. మేనేజరు గదిలోని లాకర్లను తెరిపించి, అందులో భద్రపరిచిన రూ.2.50 లక్షల నగదును తీసుకుని, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లిపోయారు. అనంతరం వజ్రకరూరులోని గుంతకల్లు రోడ్డులో గల శివశక్తి పెట్రోల్ బంకులోకి అదే ముఠా చొరబడింది. నిద్రిస్తున్న సిబ్బందిని లేపి రాడ్లు, కర్రలతో బెదిరించారు. డబ్బు ఎక్కడున్నాయని అడిగారు. సిబ్బంది వద్దనున్న ఫోన్లను లాక్కుని, చంపుతామని బెదిరించారు. సిబ్బంది కేకలు వేయడంతో వారిపై దాడి చేసి, బంకులో ఉన్న రూ.1.20 లక్షల నగదు తీసుకుని, ఉడాయించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్‌టీం చోరీ జరిగిన పెట్రోల్ బంకులను పరిశీలించారు. దోపిడీ దొంగలు వాడిన వాహనానికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. క్లూస్ టీంలతో ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రెక్కీ నిర్వహించారా..?

వజ్రకరూరు మండల కేంద్రంలో గుంతకల్లు రోడ్డులో ఉన్న శివశక్తి పెట్రోల్ బంకులోదోపిడీకి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీ లభించింది. దొంగలు బొలెరో వాహనాన్ని పెట్రోల్ బంకు వద్ద ఆపి, అందులోని రాడ్లను తీసుకెళ్తున్న దృశ్యాలు నమోదయ్యాయి. దొంగలు హిందీ, తెలుగు మాట్లాడినట్లు బాధితులు తెలిపారు. దోపిడీ అనంతరం ముఠా సభ్యులు కొనకొండ్ల వైపు వెళ్లినట్లు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. ఆమిద్యాలలో దోపిడీ జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై ఉండుంటే వజ్రకరూరులో నియంత్రించి ఉండవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. దోపిడీకి ముందు రెక్కీ దొంగలు నిర్వహించారా.., పక్కా ప్రణాళికతో పాత నేరస్థులే చేశారా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వజ్రకరూరులో దోపిడీ జరిగిన పెట్రోల్ బంకును డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం సాయంత్రం	సహార్ శనివారం ఉదయం
కదిరి:	6.37	4.59
ధర్మవరం:	6.35	4.59

ఎండుతున్న గొంతులు

● వీడని తాగునీటి కష్టాలు
● ఒట్టిపోయిన బోర్లు
● ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు
● బావుల్లోని కలుషిత నీరే గతి

ధర్మవరంరూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వేసవి రాగానే పల్లెలు, పట్టణాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రజలు, పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలు తీర్చాలంటూ రోడ్డెక్కుతున్నారు. జిల్లావ్యాప్తంగా పలుగ్రామాల్లో తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. తాగునీటి కోసం రాత్రింబవళ్లు కొళాయిల వద్ద ప్రజలు వేచిఉండే పరిస్థితి నెలకొంది. బోర్లలో నీటిమట్టం తగ్గడంతో అరకొర వచ్చే నీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అదేవిధంగా తాగునీరు లేక పశువులను సైతం అమ్ముకుంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్లు ద్వారా నీటిని కొనుగోలు చేసి ప్రజలు దాహార్తి తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ధర్మవరం మండలం ముచ్చురామి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.


ముచ్చురామిలో ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్న ప్రజలు

గ్రామంలో కొన్ని ప్రాంతాలకు మాత్రమే నీరు పోతుండటంతో మరికొన్ని ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో చేసేదేమి లేక గ్రామస్థులు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తూ గొంతు తడుపుకుంటున్నారు.

అలాగే ముదిగుబ్బ మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ పైపేడు గ్రామంలో ఈ సమస్య మరి తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్యతో బోర్లలో నీరు రాకపోవడంతో ఊరికి చివరన ఉన్న జీగుడు


పైపేడు సమీపంలోని బావి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్థులు


ముదిగుబ్బ మండలం పైపేడు గ్రామ సమీపంలో బావిలోని నీటిని తీసుకొంటున్న మహిళ

బావిలోని నీటిని సేవిస్తున్నారు. ఆ బావిలో కూడా నీరు కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీళ్ల లేక ఆ నీటినే తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. వీటితో సిరిగారిపల్లి, ముదిగుబ్బ మండల కేంద్రంలో కూడా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు..
తాగునీటి సమస్య తీవ్రం కావడంతో.. అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ప్రజలే స్వయంగా ట్యాంక్ నీటిని రూ.1000 నుంచి 1500 వెచ్చించి కొంటున్నారు. ఇలా నీటిని ఎంతకాలం కొనాలని ఆ ప్రజలు వాపోతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

● అధికారుల అలసత్వం..
గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో అధికారుల అలసత్వంతో తాగునీటి సమస్య వెంటాడుతోంది. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారులు, సర్పంచ్‌ల సమన్వయంతో వెంటనే సమస్యను పరిష్కారించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు.

సమాచారం ఇవ్వండి

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇప్పటివరకు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న తమ దృష్టికి రాలేదు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే అధికారుల దృష్టికి తెస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

శాంతన్న, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ధర్మవరం డివిజన్

న్యూస్ బాక్స్

వేలం పాట వాయిదా

కొత్తచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మేజర్ పంచాయతీకి చెందిన 49 షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలం పాట గురువారం జరగాల్సి ఉంది. అయితే గురువారం వారపు సంత.. పైగా పండుగ సంత కావడంతో తాము వేలం పాటలో పాల్గొనలేక పోతున్నామని, కావున వాయిదా వేయాలని గదుల్లో బాడుగకు ఉంటున్న వారు డీఎల్‌పీఓ కేశవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఈ వేలంపాట వాయిదా వేశామని ఆయన తెలిపారు. అంతేకాకుండా గతంలో వేలంపాట పాడి అద్దె, డిపాజిట్ చెల్లించకుండా ఉన్న మొండి బకాయిలను వసూళ్లు చేసిన తరువాతనే వేలం వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించండంతోపాటు గ్రామస్థులూ వినతి పత్రం అందజేశారు. దీంతో వేలంపాట వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు. మొండి బకాయిలున్న వారి వివరాలను సేకరించి నోటీస్ బోర్డులో ఉంచాలని, బకాయిలు ఉన్న వారికి నోటీసులు సైతం అందజేయాలని సిబ్బందికి డీపీఓ ఆదేశించారు.

సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ధర్మవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా స్థానిక ముస్లీం మైనార్టీ పేద కుటుంబాలకు హజరత్ టిప్పుసుల్తాన్ బృందం సభ్యులు గురువారం నిత్యావసర సరుకులను పంపిణీచేశారు. స్థానిక పీఆర్‌టీ షాదీమహల్‌లో సుమారు 200 మందికి వాటిని అందజేశారు.

రీ సర్వేకు సహకరించండి

నల్లమాడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పులగంపల్లి, వేల్లమద్ది, చారుపల్లి పంచాయతీల్లో భూ రీసర్వే నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సునీత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పై పంచాయతీలోని రైతులు రీసర్వే అధికారులకు భూముల పత్రాలను చూపించి సహకరించాలన్నారు. ప్రతి రైతు వారి పొలాల వద్దకు వెళ్లి రీసర్వే అధికారులకు సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి సరుకుల అందజేత


వృద్ధాశ్రమానికి సరుకులు అందజేస్తున్న దాత

ఓబుళదేవరచెరువు(అమడగూరు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని గాజులవారిపల్లి సమీపంలోని మాతృశ్రీ వృద్ధాశ్రమానికి గురువారం తనకల్లు మండలంలోని నాయనిచెరువు పల్లికి చెందిన కొండ్ల వెంకటరమణ, జయమ్మ, కొండ్ల మంజునాథ్, చంద్రమోహన్ నిత్యవసర వస్తువులను అందజేశారు. ఉగాది పండుగ నేపథ్యంలో రూ. పదివేల విలువ చేస్తే నిత్యావసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తనకల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజీప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఏప్రిల్ 9లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఖాళీలున్నాయని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీలకు ఏప్రిల్ 20న సీజీ ప్రాజెక్టులోని పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ సెల్: 94933 60217ను సంప్రదించాలన్నారు.

ప్రతి రైతూ గుర్తింపు కార్డు పొందాలి

నంబులపూలకుంట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతిరైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం పేరు నమోదు చేయించుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6,228 మంది రైతులుని, వీరిలో 4,977 మంది రైతులు గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు త్వరగా చేయించుకోవాలని అన్నారు. అలా చేయించుకోకపోతే కేంద్రం, రాష్ట్రం నుంచి వచ్చే పథకాలు వర్తించవన్నారు. రబీ పంట నమోదు వివరాలను రైతు సేవా కేంద్రంలో పొందుపరచామని, రైతులు పరిశీలించుకోవాలని అన్నారు.

నవోదయ-2ను పకడ్బందీగా అమలు చేయండి


కేసుల గురించి ఆరాతీస్తున్న డిప్యూటీ కమిషనర్

తనకల్లు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన నవోదయ-2ను పగడ్బందీగా అమలు చేయాలని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ శ్రీరామ్ సూచించారు. వారు మండలంలోని పరాకువాండ్లపల్లిలో ఉన్న ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలను త్వర లో వేలం వేయాలన్నారు. ఇందులో ఇన్‌స్పెక్టర్ మారుతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

కదిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించే రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని కదిరి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్రారంభించినట్లు రీసోర్స్ పర్సన్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పోషణటి పడాయిటీపై శిక్షణ ఇస్తామన్నారు. చిన్నారులకు ఆటపాటలతో ఏ విధంగా బోధించాలనే అంశంపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలివేలు, మమత తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనం నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న, 60 సంవత్సరాల పైబడిన వారికి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ కిష్టప్పకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ నాయకులు మాట్లాడుతూ.. గతేడాది నుంచి ఉపాధ్యాయ సంఘాలతో కో-ఆర్డినేషన్ మీటింగ్ విద్యాశాఖ అధికారులు నిర్వహించలేదన్నారు. ఆర్‌జేడీ రెండు నెలలకు ఒకసారి సంఘాలతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలని గతంలోనే ఆదేశించారన్నారు. ఇప్పటి వరకు ఒక్క మీటింగ్ కూడా నిర్వహించలేదన్నారు. ఇకనుంచైనా రెండు నెలలకోసారి సంఘాలతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలన్నారు. కదిరి ప్రాంతంలో సీఎస్, డీఓలను నియమించే క్రమంలో చాలా అవకతవకలు జరిగాయని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు ఆర్ చంద్ర, భాస్కర్, చెన్నకేశవ, నాయుడు, వేణు ఉన్నారు.

రీసర్వే సజావుగా చేపట్టాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

నంబులపూలకుంట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ఎలాంటి సమస్యలు లేకుండా భూ రీసర్వే సజావుగా గడువు లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి వంకమద్ది, పెడబల్లి గ్రామాల్లో రీసర్వే ర్యాలీ ద్వారా ప్రారంభించాలన్నారు. రైతులందరికి రీసర్వేపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మం డల సర్వేయర్ జిలాన్, ఆర్ఐ శ్రీధర్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు ఉన్నారు.

రోగులకు అన్నదానం

ధర్మవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 300 మంది రోగులకు యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర ఆస్పత్రిలో 2008 నుంచి ప్రతి గురువారం రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఎవ్వైనా దాతలు ముందుకు వస్తే వారి సహకారంతో.. రాని రోజున తామే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్ప త్రి సూపరింటెండెంట్ మాధవి, ఆ ఫౌండేషన్ సభ్యులు వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, మల్లికార్జున, గుండాపుల్లయ్య, గీతా లోకేశ్ పాల్గొన్నారు.


రోగులకు అన్నదానం చేస్తున్న సభ్యులు


ఎన్నికల కమిషనర్‌తో కార్యవర్గ సభ్యులు

న్యాయవాదుల సంఘం ఏర్పాటు

కదిరిలీగల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కదిరి న్యాయవాదుల సంఘానికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన వారి వివరాలను ఎన్నికల కమిషనర్ డీ షాఅలీమియా, సహాయ ఎన్నికల కమిషనర్ ఎం రెడ్డప్ప వెల్లడించారు. అధ్యక్ష స్థానానికి పోటీచేసిన లోకేశ్వర్‌రెడ్డిపై చౌడప్ప 28 ఓట్ల మెజార్టీతో, ఉపాధ్యక్ష పదవికి పోటీపడిన వెంకటేష్‌పై రమేష్ 12 ఓట్ల మెజార్టీతో గెలుపొందారన్నారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి సురేంద్ర, వెంకటరామిరెడ్డి పోటీ పడగా ఇరువురికి సమానంగా ఓట్లు రావడంతో ఇద్దరూ ప్రధాన కార్యదర్శులు కొనసాగేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. జాయింట్ సెక్రెటరీగా శివశంకర్, కోశాధికారిగా రాఘవేంద్ర, లైబ్రరీ కార్యదర్శిగా జ్ఞానవర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికలకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న హరీశ్‌బాబు

ధర్మవరం, మార్చి27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన పిక్కిలి లక్ష్మీనారాయణ, రాజేశ్వరి కుమారుడు చిన్నారి విష్ణుతేజ ఏడాది నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం సాయం అందించాలని చిన్నారి తల్లిదండ్రులు మంత్రి సత్యకుమార్‌ను ఇటీవల కోరారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈ చెక్కును గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ దంపతులకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం


ఓడీసీ: మోటార్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం పంచాయతీ పాలెనేనివాండ్లపల్లిలో నీటి సమస్య పరిష్కారమైంది. ఈ గ్రామంలో గతంలో సింగల్‌ఫెస్ మోటారు ఉండటంతో తరచూ తాగునీటి సమస్యతో గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. సమస్యను ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.3 లక్షలతో త్రీఫెస్ మోటార్‌ను గురువారం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

● బుక్కపట్నం: స్థానిక పాత ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో భాగంగా గురువారం కొత్త బోరును వేశారు. ఇందులో సర్పంచ్ నాగలక్ష్మీరాజు, పంచాయతీ కార్యదర్శి సాదిక్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగాధర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి

ధర్మవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు సంబంధించి ఈకేవైసీ గడువును పొడిగించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు ఆర్డీఓ మహేశ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఈకేవైసీ గడువు ఈ నెలతో ముగుస్తుండటంతో దూర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా దూరప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయని, ప్రభుత్వం ప్రకటించిన తేదీలోపు రావడానికి అవకాశం లేకపోవడంతో వారు ఈకేవైసీ చేయించుకోలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే సెలవుల వరకు పొడిగించాలని, ఈకేవైసీ తీసుకోవడానికి ప్రతిస్టోర్ డీలర్ లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లాలని, ఆ విధంగా లబ్ధిదారులందరికి ఈకేవైసీ చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, మండల కో కన్వీనర్లు ఎల్ ఆదినారాయణ,హైదర్‌వలీ, హరి ఉన్నారు.

● కదిరి(తలుపుల): రేషన్‌కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదాడుడు ఈకేవైసీ చేయించుకోవడానికి ఈనెల 31 ఉన్న గడువును పెంచాలని తలుపుల మండల సీపీఐ నాయకులు ఇన్‌చార్జీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. పరీక్ష సమయం కావడంతో చాలామంది విద్యార్థులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. గడువు మీరిన తరువాత ఈకేవైసీ చేయించుకొని వారికి రేషన్ సరుకులు రాకపోతే పేదలు ఇబ్బంది పడతారని, కావున గడువు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఈశ్వరయ్య, ఎల్‌వీ రమణ, ఆంజన్‌బాబు, సిద్దయ్య, హస్సన్, అశోక్, హరికేశవయ్య పాల్గొన్నారు.


ధర్మవరం : ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్రైం న్యూస్..

వ్యాన్‌ను ఢీకొన్న కారు.. ఏడుగురికి గాయాలు

బాధితులందరూ ఉపాధ్యాయులే



చికిత్స పొందుతున్న ఉమాదేవి, ఆనంద్‌రెడ్డి

బత్తలపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ఉపాధ్యాయులు గాయపడ్డారు. మండలంలోని నల్లబోయనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసే తొమ్మిది మంది ఉపాధ్యాయులు గురువారం విధులు ముగించుకొని ప్రత్యేక వ్యాన్ లో అనంతపురానికి బయలుదేరారు. ఉప్పర్లసల్లి క్రాస్ వద్దకు రాగా నే కదిరి వైపు నుంచి వస్తున్న కారు ఈ వ్యాన్‌ను ఢీకొంది. దీంతో వ్యాన్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఉమాదేవి, ఆనంద్‌రెడ్డి, విశాల, పార్వతమ్మ, బిల్లే ఉమాదేవి, రామచంద్ర, చాంద్ బాష గాయపడ్డారు. గాయపడ్డ ఈ ఏడుగురు ఉపాధ్యాయులను వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఆ ఆసుపత్రికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ముద్దుకిష్ట గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన భార్య, స్థానికులు అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైదులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ముద్దుకిష్ట కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించినట్లు స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముదిగుబ్బ ఎంపీపీ భూఆక్రమణపై ఫిర్యాదు


జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్ గిరిజన భూముల ఆక్రమణపై ఢిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జఠాత్‌హుస్సేన్‌నాయక్‌కు గురువారం ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస నాయక్ తెలిపారు. ఆదినారాయణయాదవ్ గిరిజనుల భూముల అక్రమణలు, దౌర్జాలన్యాలను వివరించినట్లు తెలిపారు. గిరిజన భూములను ఆక్రమించిన ఎంపీపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఆయనతో పాటు రవీంద్రనాయక్, నరేష్‌నాయక్, బునాయక్ ఉన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కదిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో విధుల్లో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెక్షన్ విధించారని, దాన్ని వెంటనే ఎత్తివేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఇందులో పలువురు మాట్లాడుతూ.. పది పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో నియమించిన ఇన్విజిలేటర్ల విషయంలో కదిరి ఎంఈఓ చెన్నక్రిష్ణపై చర్యలు తీసుకోవాలని ఓ సంఘం జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. దీన్ని అన్ని సంఘాలు ఖండిస్తున్నట్లు చెప్పారు. ఒక సంఘం స్వార్థ ప్రయోజనాల కోసం ఎంఈఓలపై ఇలాంటి ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్, ఎస్‌టీయూ, వైఎస్ఆర్‌టీఏ, టీఎన్‌యూఎస్, ఏపీటీఎఫ్1935 సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు సంత వేలం

ఓబుళదేవరచెరువు, మార్చి27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సచివాలయంలో కొండకమర్ల వారపు సంతను వేలంపాటను శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మద్దిలేటిరెడ్డి గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50వేలు దరావతు చెల్లించాలన్నారు.

న్యూస్ బాక్స్

పశువైద్యాధికారిని నియమించండి



పశువైద్యశాల ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మడకశిర రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని గురువారం కార్యాలయం ముందు పాడి రైతులు నిరసన వ్యక్తంచేశారు. రైతులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా పశువైద్యాధికారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ ఆస్పత్రి పరిధిలో అనేక గ్రామాలు ఉన్నాయన్నారు. వేసవి కాలంలో పాడి పశువులకు, గొర్రెలకు రోగాలు వస్తున్నాయని, వైద్యుడు లేక అవి మృత్యువాత పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి నివేదిక



ముఖ్యమంత్రికి నివేదికను అందజేస్తున్న జస్టిస్ నాగమోమన్‌దాస్

పావగడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసేందుకు జనాభా ఆధారంగా జస్టిస్ నాగ మోహన్‌దాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఒక కమిటీని రూపొందించిన సంగతి తెలిసిందే. నియమిత సమయంలో అధికారులు జనాభా ఆధారంగా లెక్కలు కమిటీకి అందించకపోవడంతో కమిటీ అధ్యక్షులు జస్టిస్ నాగమోహన్‌దాస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గురువారం వర్గీకరణ మధ్యంతర నివేదికను కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. వర్గీకరణపై జనాభా లెక్కలు ఎలా సేకరించవచ్చని కొన్ని అంశాలపై ఆయన అందించిన నివేదికలో పేర్కొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు



కుట్టుమిషన్లు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పావగడ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ హీరో రామ్‌చరణ్ 40వ జన్మదిన వేడుకలు పట్టణంలోని అక్షయ బ్లాజెమ్ పాఠశాల ఆవరణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పేదవారికి ఆపదలో, కష్టాలలో ఆదుకున్నవాడే నిజమైన శ్రీమంతుడని ప్రభుత్వ వైద్యాధికారి డా.మంజునాథ్ అన్నారు. రెడ్డికాలనీకి చెందిన లక్ష్మీదేవి, గుట్టహళ్లి అరుణమ్మకు కుట్టుమిషన్లు, నిరుపేద ప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మనం శశికిరణ్, బజాజ్ శ్రీనాథ్, సంధ్య, శశికిరణ్, పశువైద్యాధికారి రామాంజినప్ప, బ్లడ్ శశికళ, బేకరి నాగరాజు కేక్‌కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

చిలమత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): భూములను రీసర్వే చేయడం ద్వారా ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు పరిష్కారం దక్కుతుందని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ అన్నారు. గురువారం మండలంలోని వీరాపురం, గాండ్లదిన్నె రెవెన్యూ గ్రామాలకు సంబంధించి జరిగే రీసర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. మండల సర్వేయర్ కోదండపాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సోమందేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం జడ్‌బీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే పద్ధతులు, వాటి ఉపయోగాలను వివరించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతులకు కార్యక్రమాన్ని చపట్టామన్నారు. వ్యవసాయశఖ ఉద్యానశాఖ సెర్ప్ సంయుక్తంగా రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులు సుధాకర్, ఆగప్పలను సన్మానించారు. ఏఓ కవితారాణి, జడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల నుంచి చిన్నారులను రక్షించుకుందాం



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పిల్లలపై జరిగే వేధింపులను గుర్తించి ఆపడం మన కర్తవ్యమని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో మహిళా శిశుసంక్షేమశాఖ మిషన్ వాత్సల్య టీసీటీయూ చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలపై అత్యాచారాలు, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ పిల్లల వేధింపులనేది ఇటీవల కాలంలో సర్వసాధారణమైందన్నారు.సీడీపీఓలు శాంతలక్ష్మీ, నాగమల్లేశ్వరి, టీసీటీఓ మహేష్, కొండప్ప పాల్గొన్నారు.

బూదిలి ఉన్నత పాఠశాల తనిఖీ

గోరంట్ల, మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి ఉన్నతపాఠశాలను గురువారం డీవైఈఓ పద్మప్రియ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను చూశారు. ఆన్‌లైన్‌లోనూ పాఠశాల పేరు మార్చాలని బసవేశ్వర సంఘం కోరడంతో ఆమె విచారించి, చర్యలు చేపట్టాలని హెచ్‌ఎం వెంకటేష్‌ను ఆదేశించారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

అగళి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వారి గుర్తింపుగా రూ.6500 విలువచేసే మైక్‌సెట్‌ను బహుమతిగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు మైక్ సెట్ విరాళం అందజేసినందుకు ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

కాంట్రాక్టర్ల కుమ్మక్కు..!

● వేలంలో పంచాయతీ ఆదాయానికి భారీగా గండి



సోమందేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ గంగాదేవి అధ్యక్షతన గురువారం నిర్వహించిన వేలంపాటలో కాంట్రాక్టర్లు కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి భీఈగా గండకొట్టారు. సిండికేట్‌గా మారి తక్కువ ధరకే వేలాలు పాడి దక్కించుకున్నారు. అంతా ప్రణాళికబద్దంగా జరిగింది. వారపుసంత సర్కారువారిపాట రూ.18లక్షలుకాగా కేవలం ముగ్గురు మాత్రమే పోటీపడ్డారు. హరి, శివశంకర్, వెంకటేశులు పోటీపడగా హరి రూ.18,7000కు దక్కించుకున్నారు. బస్టాండుకు సంబంధించిన వేలంపాటలో శివశంకర్, నరేంద్ర పోటీపడగా సర్కారువారిపాట రూ.60వేలుకాగా రూ.63,500కు నరేంద్ర దక్కించుకున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండిపడింది. అనంతరం పంచాయతీ కాంప్లెక్స్ గదులకు వేలాలు నిర్వహించారు. అదేవిధంగా గత యేడాది 2024-25సంవత్సరానికి 9నెలల కాలానికి వేసిన వేలాల్లో అప్పట్లో సర్కారువారిపాట రూ.13లక్షలు కాగా గుత్తేదారు హరిక్రిష్ణ రూ.13,5000 దక్కించుకోగా, బస్టాండు వేలం రూ.50వేలుకాగా రూ.50,500కు కిష్టప్ప దక్కించుకున్నారు. క్రితం వేలాల్లో ఇదే తంతు జరిగింది. గత యేడాది వేలాల్లో వారపు సంత, కాంప్లెక్స్ గదులకు సంబంధించి రూ.10,72,600 బకాయిలు ఉన్నాయి. ఇంతవరకు అవి వసూలైన దాఖలాలులేవు. ఇలా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నా దాదాపు రూ.కోటివరకు బకాయిలు పేరుకుపోయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారులు, కాంట్రాక్టర్లపై కఠినంగా వ్యవహరించకపోవడంపట్ల ఈ బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏడాదిలోపు విడతలవారిగా బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించని పక్షంలో వారిపై చర్యలు తీసుకునే అధికారం పంచాయతీకి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ రోజు జరిగిన వేలాల్లో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, వేలం దక్కించుకున్న కాంట్రాక్టను హెచ్చరించారు. బకాయిలను రెండు రోజుల్లోగా చెల్లించకపోతే డిపాజిట్ పంచాయతీ పద్దులకు జమచేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి వేలాలు నిర్వహిస్తామని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. పేరుకుపోయిన బకాయిల విషయంలో పంచాయతీ ఇన్చార్జ్ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా త్వరలో పాత కాంట్రాక్టర్లపై చట్టబద్ధమై చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిల వివరాలు అడగ్గా ఆయన చెప్పడానికి నిరాకరించారు. సమాచార హక్కుచట్టం కోరితే వివరాలు ఇస్తామని తెలిపారు.

టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం

● పోలీసుల సమక్షంలో పశువుల సంత వేలం

గుడిబండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుడిబండ పశువుల సంత వేలంపాట సందర్భంగా టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. పోలీసుల రంగప్రవేశంతో రెండు వర్గాలను చెదరగొట్టి వేలంపాట నిర్వహించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో పశువుల సంత, కూరగాయల సంత, దినసరి బస్టాండు వేలంపాటను అధికారులు నిర్వహించారు. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య మాట మాట పెరిగి రెండు వర్గాల వాగ్వాదానికి దారితీసింది. పోలీసులు జోక్యం చేసుకొని రెండు వర్గాలకు నచ్చజెప్పి వేలంపాట సజావుగా సాగింది. ఎంపీడీఓ గంగాధర్, ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచ్ కరుణాకర్ సమక్షంలో వేలం నిర్వహించారు. పశువుల సంత రూ.67.20 లక్షలకు దిన్నేహట్టి గ్రామానికి చెందిన మల్లేష్ దక్కించుకొన్నారు. కూరగాయల సంత రూ.2.81 లక్షలకు గుడిబండ పురుషోత్తం దక్కించుకొన్నారు. దినసరి బస్టాండు రూ.2.05 లక్షలకు నటరాజ్ సొంతం చేసుకున్నారు.

కల్లుమర్రి ఉప సర్పంచ్ ఏకగ్రీవం



ఉప సర్పంచ్ నరసన్నకు డిక్లరేషన్ ఫాం అందజేస్తున్న అధికారులు

మడకశిర రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో గురువారం నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎంపీడీఓ సోనియాబాయి, ఆర్ఓ నాగరాజు నాయక్ తెలిపారు. పంచాయతీలో 12 మంది వార్డు సభ్యులుండగా ఇద్దరు హాజరుకాలేదు. గ్రామ సర్పంచు గంగమ్మతో పాటు 10 మంది వార్డు సభ్యులు ఉప సర్పంచు కేపీ నరసన్నను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాంపురం వైస్ సర్పంచ్‌గా నాగప్ప



వైస్ సర్పంచ్ నాగప్పను డిక్లరేషన్ ఫాం అందజేస్తున్న ఎన్నికల అధికారి

పెనుకొండ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామ పంచాయతీ సచివాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో వైస్ సర్పంచ్‌గా నాగప్ప ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి శ్రీదేవి తెలిపారు. రాంపురం వైస్ సర్పంచ్ హనుమంతునాయక్ భార్య నవతాబాయి రాజీనామా చేశారు. గురువారం వైస్ సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 13మంది వార్డుమెంబర్లుండగా 9మంది సర్పంచ్ శ్రీనివాసులు ఎన్నికలకు హాజరయ్యారు. అనంతరం డిక్లరేషన్ ఫాం నాగప్పకు అందజేశారు.

తాగునీటి బోరు కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పరిగి, మార్చి 27(ఆంధ్ర జ్యోతి): వేసవిలో నీటి సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి సవిత ఆధ్వర్యంలో గురువారం స్థానిక 90 ఇళ్లకాలనీ, తిరుమల లేఅవుట్‌లో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నీటి బోరు తవ్వకానికి స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే బోర్లను తవ్విస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. సర్పంచ్ లక్ష్మీశివశంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఎల్ మూర్తి పాల్గొన్నారు.

భారీగా తగ్గిన పంచాయతీ ఆదాయం

లేపాక్షి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండు, వారపుసంత వేలంపాట గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. బస్టాండు వేలంపాట లేపాక్షి గ్రామానికి చెందిన గోవిందప్ప రూ.34.56 లక్షలు సొంతం చేసుకున్నారు. వారపుసంతను లేపాక్షికి చెందిన నయాజ్ రూ.2.12 లక్షలకు దక్కించుకున్నాడు. వారం రోజుల క్రితం ఇదే బస్టాండు వేలాన్ని రూ.72.01 లక్షలకు శంకర్‌రెడ్డి దక్కించుకోగా.. వారపు సంత లేపాక్షి నరేష్ రూ.3.21 లక్షలకు దక్కించుకున్నాడు. సకాలంలో డబ్బు చెల్లించలేదని వేలం వాయిదా వేశారు. పంచాయతీ అధికారుల సమక్షంలో జరిగిన వేలంలో కాంట్రాక్టర్లు కుమ్మక్కై వేలం దక్కించుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సగానికి పైగా ఆదాయం కోల్పోవడంతో మండల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

రొళ్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని జడ్పీటీసీ అనంతరాజు, ఎంపీపీ కవిత విజయరంగే గౌడ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాచారం అందివ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో ఐదు పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేశామని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల కమిటీ చైర్మన్ అభిప్రాయాల మేరకు పాఠశాలలను ఎంపిక చేస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను వినియోగించుకోండి

హిందూపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘం సభ్యులతో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గానికి ఐదువేల కుట్టుమిషన్లు పంపిణీ చేసేలా చొరవ చూపుతున్నారన్నారు. కుట్టుమిషన్ కావాల్సినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు, ట్రైనర్ రవినాయక్, పావని, నాయకులు పరిమళ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రూ.93లక్షలు ఆదాయం: పట్టణంలోని మార్కెట్‌లో సుంకం వసూలుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్, పెద్ద మార్కెట్, రోడ్డుకు ఇరువైపులా తోపుడుబండ్లు, ఇతర వస్తువులపై వసూలు చేసే సుంకంపన్ను నారాయణ అనే వ్యక్తి రూ.64.30లక్షలకు దక్కించుకున్నారు. చిన్న పశువుల తోళ్లమార్కెట్ మెహజబీన్ రూ.7.30లక్షలు, పెద్ద పశువులు, వాటి తోళ్లమార్కెట్ రూ.షీరిన్ రూ.1.22లక్షలు, పరిగి బస్టాండు ఆవరణంలోని ఖాళీ స్థలాన్ని మహ్మద్ అన్వర్‌ఖాన్ రూ.21.70లక్షలకు దక్కించుకున్నాడు.

రేపు మున్సిపల్ సమావేశం: మున్సిపల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ సంగం శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. అజెండాలోని 11 అంశాలపై సమావేశంలో ఆమోదం ఉంటుందన్నారు.

విజ్ఞాన యాత్రలు చాలా అవసరం



శ్రీహరికోట విజ్ఞాన కేంద్రం గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త

హిందూపురం అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన యాత్రలు ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని ఎస్ఎస్‌బీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. కళాశాలలోని విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా శ్రీహరికోటలోని సతీషధావన్ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), తిరుపతిలోని భారతీయ విజ్ఞాన సంస్థ (ఐసర్) కేంద్రాలను సందర్శనకు గురువారం తరలివెళ్లారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు వెంకటేశులు, రమేష్ సరస్వతి, అశ్వత్థప్ప, కళావతి, నందిని వెళ్లారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మదన్‌మోహన్ రెడ్డి

పెనుకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెనుకొండ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక బార్‌అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు సీనియర్ న్యాయవాది అబూబకర్, నరేంద్రరెడ్డి, వినోద్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సభ్యులుగా ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మోహన్‌నాయక్, కార్యదర్శిగా కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా మునిరాజు, శ్రీనివాసులు, అడిషనల్ జాయింట్ కార్యదర్శిగా విశ్వనాథ్‌నాయక్, కోశాధికారిగా రాజేష్‌నాయక్, లైబ్రెరీ కార్యదర్శిగా అబ్దుల్ ముజీబ్‌ఖాన్, పఠాన్, ఎగ్జిక్యూటివ్‌మెంటర్లుగా దయానందరెడ్డి, సీఆర్ నాగార్జున, నాగేశ్వరి, ధర్మేంద్రరెడ్డి, హరీష్, మహ్మద్ అబ్దుల్ రఫీక్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సభ్యులను సీనియర్ న్యాయవాదులు శ్రీకాంత్‌రెడ్డి, శివారెడ్డి పూలమాలలువేసి అభినందనలు తెలిపారు.



నూతన కమిటీ సభ్యులతో న్యాయవాదులు

బాల్య వివాహాలతో అనర్థాలు

హిందూపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడంవల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయని హిందూపురం ప్రత్యేక న్యాయాధికారి రమణయ్య తెలిపారు. గురువారం పరిగి మండలం, ధనాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో లైంగిక వేధింపులు వివాహాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, న్యాయవాదులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మడకశిర సివిల్ కోర్టు న్యాయాధికారి అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని గుండుమల కేజీబీవీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ పోక్సో చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, సీఐ నగేష్ బాబు, న్యాయవాది గోపీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలం పాపిరెడ్డిపల్లి కేజీబీవీలో గురువారం విద్యార్థులకు లైంగిక నేరాలపై జూనియర్ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపలసయ్యద్ అవగాహన కల్పించారు. న్యాయాధికారి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన అవసరమన్నారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ అనిత, అడ్వకేట్ సుధాకర్, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి రమణయ్య

రంజాన్ వేళలు

హిందూపురం	ఇఫ్తార్ : 6.35	సహేరీ : 5.03
పెనుకొండ	ఇఫ్తార్ : 6.34	సహేరీ : 5.03
	(శుక్రవారం సాయంత్రం)	(శనివారం ఉదయం)

ఆధ్యాత్మిక చింతనతోనే విశ్వశాంతి



హోమాల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

హిందూపురం అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే విశ్వశాంతి లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని పాత పోలీస్ బ్యారెక్స్, పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ ఆలయ భూమి పూజా కార్యక్రమాన్ని చైర్మన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విశ్వ శాంతి కోసం పాటుపడే హరేకృష్ణ దేవాలయం హిందూపురంలో నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం నిర్వహించిన హోమాలు, ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేవనహళ్ళి ఆనంద్, ఎమ్మెల్యే రాజకీయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మెన్ అనిల్‌కుమార్, అశ్వత్థరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, పరిమళ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రైస్తవ మతబోధకుడు అనుమానాస్పద మృతి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

హిందూపురం అర్బన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ కిరణ్‌కుమార్ పగడాల మృతి అనుమానాస్పదంగా ఉందని క్రైస్తవులు పేర్కొన్నారు. 25వతేదీన కొవ్వూరు టోల్‌ప్లాజా వద్ద జరిగిన ప్రమాదంలో పాస్టర్ మృతిచెందాడన్నారు. తొలుత ఇది రోడ్డు ప్రమాదంగానే భావించినా తరువాత ఉన్న ఆధారాలను బట్టి అనుమానాస్పద మృతి అనిపిస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా విచారణ జరిపించి క్రైతవుల మనోభావాలను దెబ్బతీయకుండా నిజాలు వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు. హిందూపురంలోని క్రైస్తవులు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ సర్కిల్‌లో క్యాండిల్ వెలిగించి ఆయన మృతికి సంతాపం తెలుపుతూ ప్రార్థించారు. నాగేంద్రకుమార్, రెవరెండ్ ఎస్ డేవిడ్, సూర్యప్రకాష్, ఉదయ్‌కుమార్, స్టీఫెన్‌రాజ్, ఐజాక్‌పాల్, మనోజ్‌మింటూ, డేనియల్ పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న జమియత్‌ఉల్మాక కమిటీ సభ్యులు

గోరంట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జామియా మసీదు వద్ద రంజాన్ పండుగ సందర్భంగా 800 మంది నిరుపేదలకు నిత్యాసర కిట్లను జమియత్ ఉల్మా కమిటీ వారు గురువారం అందజేశారు. అందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని నిత్యావసర వస్తువులను ప్రతియేటా పంపిణీ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రూ.800 విలువ చేసే కిట్లను అందచేశారు. జమియల్ ఉల్మా కమిటీ మండలాధ్యక్షుడు షఫీవుల్లా, మౌలానాలు ముజీబ్‌రహీమాన్, అబ్దుల్లా, ముజీబుల్లా, అతావుల్లా, ముష్షి, కలీముల్లా, మునాఫ్, హారూన్, ముస్తఫా, ముక్తియార్ పాల్గొన్నారు.

ఘనంగా సతామి



ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు, మత పెద్దలు

పెనుకొండ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 26వ ఉపవాసం చాలా ప్రత్యేకమైనది. ఈరోజు సతామి లైలతుల్ ఖద్ర్ చేసుకుంటారు. ఇదేరోజు ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ దివి నుంచి భువికి దిగివచ్చినట్లు భావిస్తారు. ఈరోజు రాత్రి జాగరణ, ప్రార్థనలు చేసి భక్తితో గడుపుతారు. ఈ ఒక్కరాత్రి భక్తితో ప్రార్థనలు చేసేవారికి 83ఏళ్ల ప్రార్థనలు చేసిన పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఈ రాత్రి చేసే ప్రార్థనలు సర్వపాపాలు హరిస్తాయని ముస్లింలు భావిస్తారు.

వ్యక్తికి రిమాండ్

రొళ్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలిక వివాహ విషయంగా సనావుల్లా అనే వ్యక్తికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలికను సనావుల్లా మాయమాటలుచెప్పి గర్భవతిని చేయగా సదరు బాలికకు సనావుల్లాకు ఇచ్చి మసీదు పెద్దలు, సనావుల్లా తల్లిదండ్రులు మసీదులో వివాహం జరిపించారు. ఆమెకు ఒక కుమార్తె పుట్టగా సనావుల్లా బాలికను పట్టించుకోకుండా వదిలి వెళ్లిపోయాడు. సనావుల్లాపై, బాలికకు పెళ్లిచేసిన నలుగురు మసీదు పెద్దలపై, తల్లిదండ్రులు, బాలిక తండ్రిపై కేసు నమోదు చేశారు. గురువారం సనావుల్లాను అరెస్టు చేసి మడకశిర జెఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

గుడిబండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాజకుల్లాయప్ప సూచించారు. గురువారం మండలంలోని మందలపల్లిలో పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

అగళి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలం ఆర్‌జీపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను మండల కన్వీనర్ కుమారస్వామి స్థానిక సర్పంచ్ నన్నమ్మ, రంగయ్య, గురువారం పంపిణీ చేశారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని కన్వీనర్ తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి రఘు, లింగరాజు, నాగరాజు, అక్లీన్‌సాబ్, చిక్కన్న, చక్రపాణి పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలో గురువారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, రామిరెడ్డి, ప్రసాద్, చెన్నప్ప, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, మాజీ సర్పంచి శకునప్ప, దాదాపీర్ పాల్గొన్నారు.